క్లుప్తంగా

అయోధ్య రామమందిర అక్షతల పంపిణీ



శ్రీరాముని అక్షతలకు పూజ చేస్తున్న భక్తులు

అల్లవరం: అయోధ్య రామమందిర ప్రతిష్ఠలో పూజించిన అక్షతలను ఇంటింటికీ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అల్లవరంలోని శ్రీరామాలయంలో ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్ శంకర్‌గౌడ చేతుల మీదుగా భక్తులకు అందించారు. కార్యక్రమంలో జి.పుల్లయ్యశెట్టి, విశ్వహిందూపరిషత్ మండల అధ్యక్షుడు కర్రి శ్రీనివాస్, ధర్మప్రసాద్, కొమ్మూరి రామచంద్రరావు, బండిగుప్తాపు వెంకటేశ్వరరావు, కామవరపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గణేష్



గణేష్

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అమలాపురం మండలం బండారులంక గ్రామానికి చెందిన జాన జగదీష్ చంద్ర గణేష్‌ను నియమించారు. గణేష్ బండారులంకలో వార్డు మెంబర్‌గా, పార్టీ చేనేత విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. తనకు పదవి రావడానికి కారణమైన రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాస్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. చేనేత కార్మికుల తరఫున పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు.

20న యానాంలో క్రిస్మస్ వేడుకలు

యానాం: ఈ నెల 20న పట్టణంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక బెజవాడ గార్డెన్స్‌లో ఎమ్మెల్యే కార్యాలయం ఎదురుగా ఏర్పాటుచేసిన స్థలంలో సాయంత్రం 4 గంటల నుంచి క్రిస్మస్ వేడుకలు జరుగుతాయన్నారు. క్రిస్మస్ సందేశాన్ని సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బీహెచ్‌వీ మూర్తిరాజు, హేర్మోన్ మినిస్ట్రీస్ పాస్టర్ డాక్టర్ ఎం.జోషప్‌కిషోర్ వినిపిస్తారని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని క్రైస్తవులు వేడుకలకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పర్యావరణంపై అవగాహన అవసరం

ముమ్మిడివరం: విద్యార్థులంతా పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలని నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర డైరెక్టర్ పి.స్రవంతి అన్నారు. ముమ్మిడివరంలోని ప్రైవేటు పాఠశాలలు భాష్యం, శ్రీబాలాజీ, రవీంద్ర కాన్వెంట్‌లను శనివారం ఆమె పరిశీలించారు. పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతీఒక్కరూ మొక్కలు నాటాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రీన్ కోర్ సభ్యులు జి.ప్రభావతి, ఏడీ సురేష్ బాబు, మండల విద్యాశాఖాధికారి బి.రమణశ్రీ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నవోదయలో ముగిసిన ఫిట్ ఇండియా



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ రఘునాయగం

యానాం: మెట్టకూరులోని జవహర్ నవోదయ విద్యాలయలో ఈ నెల 9వ తేదీ నుంచి జరుగుతున్న ఫిట్ ఇండియా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ముగింపు వేడుకలకు ఎస్పీ రఘునాయగం ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడాజ్యోతిని వెలిగించారు. అనంతరం నిర్వహించిన క్రీడల్లో విజేతలకు ఎస్పీ రఘునాయగం, ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీప్రసన్న, వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులకు పోషకాహారం అందజేత

అమలాపురం రూరల్: స్థానిక విద్యుత్‌నగర్‌లో ఉన్న చేంజెస్ విహాన్ కేర్ అండ్ సపోర్ట్ సెంటర్‌లో శనివారం జరిగిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం వేడుకల్లో 120 మంది హెచ్ఐవీ బాధితులకు పోషకాహారం, దుప్పట్లు అందజేశారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్ కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు సాక ప్రసన్నకుమార్, లింగోలు పండు పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు



కాట్రేనికోనలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న ఆర్బీకే సిబ్బంది



వేట్లపాలెంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న ఆర్బీకే సిబ్బంది

కాట్రేనికోన: తొలకరి పంటలో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం మద్దతు ధరకే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తుంది. మండలంలో 14 రెవెన్యూ గ్రామాల పరిధిలో 17 ఆర్బీకే కేంద్రాల ద్వారా రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుంది. మండలంలో తొలకరి పంటలో సుమారు 4,400 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. మిచాంగ్ తుపాను కారణంగా అప్పటికే కోతలు పూర్తయినా పూర్తి స్థాయిలో నూర్పిడులు జరగని కారణంగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉన్నత స్థాయి అధికారులను పంపించి తుపానుతో నష్టపోయిన ప్రతి రైతుకూ భరోసా కల్పించారు. తడిసిన ధాన్యం, పనలపై ఉన్న వరి, తుఫానుతో పడిపోయిన వరి చేలపై మొలకలు రాకుండా వ్యవసాయశాఖ అధికారులు దగ్గరుండి రైతులచే 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయించారు. తడిసిన వరి చేలను రక్షించుకునేందుకు అవసరమైన సలహాలు, సూచనలను వ్యవసాయశాఖ అధికారులు అందించారు.

పంట నష్టం గుర్తింపు

తుపాను కారణంగా కాట్రేనికోన మండలంలో సుమారు 1200 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. మండలంలో 80 శాతం కోతలు పూర్తయ్యాయి. తేమ శాతం 17 లోపు ఉన్న ధాన్యానికి మద్దతు ధర క్వింటాకు రూ.2150లు చెల్లించి కొనుగోలు చేశారు. ఇప్పటివరకూ సుమారు 1180 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేశారు. మరో 900 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉన్నట్లు గుర్తించామని అధికారులు చెబుతున్నారు. తుఫాను కారణంగా నష్టపోయిన రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు



రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటికే 1180 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. రైతుల వద్ద మరో 900 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు గుర్తించాం. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రవీణ్, మండల వ్యవసాయఅధికారి, కాట్రేనికోన

ఇంటింటికీ సంక్షేమ పథకాలే లక్ష్యం

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- ఎ.వేమవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఎ.వేమవరంలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రాలను అందిస్తున్న డాక్టర్ పినిపే శ్రీకాంత్

అమలాపురం రూరల్: ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందజేయడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్ అన్నారు. ఎ.వేమవరంలో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లలోని మురుగునీరు దిగే మార్గం లేక వర్షాలొస్తే తమ ప్రాంతం ముంపునకు గురవుతుందని, డ్రైనేజీ నిర్మించేలా చూడాలంటూ మున్నానగర్ కాలనీవాసులు ఆయనను కోరారు. డ్రైనేజీ నిర్మాణానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ రూ 5 లక్షలు కేటాయించారని, మొత్తం సర్వే చేయించి డ్రైనేజీ నిర్మాణం చేపట్టేలా చూస్తానని శ్రీకాంత్ బదులిచ్చారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ ఇంటింటికీ సంక్షేమ పథకాల వల్ల మేలు జరుగుతుందంటే అది సీఎం జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనకు నిదర్శనమన్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, సొసైటీ అధ్యక్షుడు జి.శాస్త్రి, ఎంపీడీవో జె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, వాకలపల్లి మురళీకృష్ణ, ముత్తాబత్తుల శ్రీను, గెడ్డం ఆనంద్, జంగా అంజిబాబు, ఏఈలు చినబాబు, వర్మ, కార్యదర్శి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పంట కాలువలోకి దూసుకెళ్లిన కారు



పంట పొలాల్లోకి దూసుకుపోయిన కారు

తాళ్లరేవు: కాకినాడ నుంచి యానాం వైపునకు వెళుతున్న కారు అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకెళ్లిన ఘటన చొల్లంగి వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం సాయంత్రం కాకినాడ నుంచి యానాం వెళుతున్న కారు జాతీయ రహదారి–216పై చొల్లంగి వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపు తప్పి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకుపోయింది. అదృష్టవశాత్తూ కారులో ప్రయాణిస్తున్న వారంతా ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఆలోచింపజేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన



విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన పాఠశాల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ ఆలోచింపజేసింది. సైన్స్ ఉపాధ్యాయులు ఎం.వెంకటేశ్వరరావు, కేవీఎస్ఎ లక్ష్మి, గణిత ఉపాధ్యాయుడు ఎస్.వెంకటేశ్వర్లు, యూబీటీ సుందరి సూచనలతో విద్యార్థులు పలు సైన్స్ ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. ఈ ప్రదర్శనలకు న్యాయ నిర్ణేతలుగా ప్రధానోపాధ్యాయుడు గౌరీ శంకర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పీవీఎన్ రవికుమార్‌లు వ్యవహరించారు. స్కూలు విద్యార్థులు డి.లక్ష్మీశ్రావణి, సీహెచ్ వెంకటేశ్వరిలు ప్రదర్శించిన న్యూక్లియర్ పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్ ప్రథమ బహుమతిని గెలుచుకుంది. విద్యార్థులు ఎం.కళ్యాణి, పి.పవిత్రలు ప్రదర్శించిన సేవ్ ట్రీ అండ్ సేవ్ నేచర్ ప్రాజెక్ట్‌కు ద్వితీయ బహుమతి లభించింది. జి.హిమబిందు ప్రదర్శించిన హ్యూమన్ హార్ట్ సర్క్యులేటరీ సిస్టమ్ ప్రాజెక్ట్, సీహెచ్ అనీలసుధ ప్రదర్శించిన సోలార్ సెన్సర్ కేటిల్ షెడ్డు ప్రాజెక్టులు సైతం బహుమతులు గెలుచుకున్నాయి.

షష్ఠి ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ



గుత్తినదీవి–వేమవరం గ్రామంలో ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

ఐ.పోలవరం: గుత్తినదీవి–వేమవరంలో వేంచేసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహమణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాల ఏర్పాట్లను అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులతో ఉత్సవాల ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 17 నుంచి 21 వరకూ జరిగే షష్ఠి ఉత్సవాల్లో ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతల నిర్వహణ, పార్కింగ్ మేనేజ్‌మెంట్ తదితర విషయాలపై చర్చించి సూచనలిచ్చారు. అశ్లీల నృత్యాలు, జూద క్రీడలు లేకుండా ప్రశాంత వాతావరణంలో సంప్రదాయ పద్ధతిలో ఉత్సవాలు నిర్వహించాలన్నారు. డీఎస్పీ వెంట ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య, ఎస్ఐ రాజేష్, సర్పంచ్ నల్లా సుదర్శన్, ఉత్సవ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

ఆస్పత్రికి మతి స్థిమితం లేని మహిళ తరలింపు

అమలాపురం టౌన్: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో మతిస్థిమితం లేకుండా సంచరిస్తున్న మహిళను పలు ప్రభుత్వ శాఖల అధికారులు, స్థానికుల సహకారంతో వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రికి శుక్రవారం రాత్రి తరలించారు. పోలీసుశాఖ, ఐసీడీఎస్ అధికారులు ఆ మహిళను పంపించే ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవాణి, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర, డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కాశీ మునికుమారి, అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు, పట్టణ మహిళా ఎస్ఐ దేవసుధ, వైఎస్సార్ సీపీ నాయకుడు కుడుపూడి శాంతిభూషణ్ తదితరులు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి మానసిక వైద్య విభాగానికి ఆ మహిళను ప్రత్యేక అంబులెన్స్‌లో పంపించారు. వివిధ సామాజిక సంఘాలకు చెందిన నాయకులు చింతా కిరణ్‌కుమార్, జల్లి సుజాత, కొంకి రాజామణి, మాకిరెడ్డి పూర్ణిమ, సాధు సుమంత్, పచ్చిమాల శ్రీనివాస్ తదితరులు సహకారం అందించారు.

24న గ్రూప్ పరీక్షలపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సు కరపత్రాలను విడుదల చేస్తున్న విజయవాడ డీసీపీ సత్తిబాబు తదితరులు

అమలాపురం టౌన్: ఈ నెల 24వ తేదీన గ్రూప్–1, 2 పరీక్షలు రాయబోయే అభ్యర్థుల కోసం అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీచారిటబుల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు పిలుపునిచ్చారు. స్థానిక స్వయం ప్రభ హోటల్‌లో శనివారం జరిగిన సమావేశంలో డీసీపీ సత్తిబాబు సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని సామాజిక వర్గాలకు చెందిన 100 మందికి ఉచిత స్టడీ మెటీరియల్, మరో 100 మందికి ప్రిలిమనరీ కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగారాజు, అంబేద్కర్ మహిళా సంఘం అధ్యక్షురాలు పి.రజనీ, వీకేసీ పార్టీ నాయకుడు బొంతు రమణ, గెద్దాడ బుద్ధరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివశంకర ప్రసాద్

అమలాపురం టౌన్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివశంకర ప్రసాద్ సూచించారు. జిల్లా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక వడ్డిగూడెంలోని ప్రభుత్వ కళాశాలల బాలికల వసతి గృహంలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు శనివారం నిర్వహించిన ప్రేరణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి జ్యోతిలక్ష్మీదేవి, అధ్యాపకులు రాము, సురేష్‌కుమార్, విష్ణుప్రసాద్‌లు పరీక్షల సన్నద్ధతతో పాటు పలు పాఠ్యాంశాల ప్రశ్నా పత్రాలపై అవగాహన కల్పించారు. అమలాపురం, రామచంద్రపురం సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు ఎస్.సత్యనారాయణ, ఎం.వెంకటేశ్వర్లు, వసతి గృహ సంక్షేమ అధికారులు పి.రోజా, ఎ.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస మహోత్సవాలు



కేశవపురంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామివారు



ధనుర్మాస మహోత్సవాల ఆహ్వాన పత్రాన్ని ఎమ్మెల్యే పొన్నాడకు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తాళ్లరేవు: నెల రోజుల పాటు జరగనున్న పవిత్ర ధనుర్మాస మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండలంలోని చరిత్ర ప్రసిద్ధి గాంచిన కేశవపురం శ్రీకేశవస్వామివారి ఆలయం, పి.మల్లవరం శ్రీదేవీ, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంతో పాటు కోరంగి వేణుగోపాలస్వామి ఆలయం, సుంకరపాలెం సీతారామస్వామి వారి ఆలయం, తాళ్లరేవు ప్రధాన రహదారిలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయాల్లో నెలరోజుల పాటు విశేష పూజలు నిర్వహించనున్నారు.

ఎమ్మెల్యే పొన్నాడకు ఆహ్వానపత్రం

తాళ్లరేవు కేశవస్వామి ఆలయంలో నిర్వహించే ఉత్సవాలకు హాజరు కావాల్సిందిగా తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు ఆలయ కమిటీ చైర్మన్ కొల్లు శ్రీను, కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరరావులు ఆహ్వాన పత్రం అందజేశారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ ఉదయం 5 గంటలకు తీర్థపు బిందె, స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, 6.30 గంటలకు బాలభోగ నివేదన జరిపిస్తారు. 19వ తేదీ మంగళవారం ఆంజనేయస్వామివారికి, 22న గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఏకాహం, గ్రామోత్సవం, 24న హనుమద్వ్రతం, వచ్చే నెల 2న సామూహికంగా లక్ష తులసి పూజ, అమ్మవారికి కుంకుమపూజ, ఆంజనేయస్వామికి లక్ష తమలపాకులు, సింధూర పూజలు 25 మంది రుత్విక్కులచే శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. 14వ తేదీ భోగి పండుగ రోజున గోదాదేవి కల్యాణం జరగనుంది.

కుమ్మరి కాల్వలోకి సెప్టీ క్లీన్ వ్యర్థాలు



సెప్టీ క్లీన్ ట్యాంకర్ నుంచి కుమ్మరి కాల్వలోకి వ్యర్థాలను వదులుతున్న దృశ్యం

అమలాపురం టౌన్: స్థానిక కుమ్మరి కాల్వ వంతెన పైనుంచి ఓ సెప్టీ క్లీన్ ట్యాంకర్ నుంచి వ్యర్థాలను వదులుతున్న వీడియో దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో మున్సిపాలిటీ, పోలీసు అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలకు పూనుకున్నారు. అమలాపురం ఆజాద్ ఫౌండేషన్‌కు చెందిన సభ్యులు సెప్టీ క్లీన్ ట్యాంకర్ నుంచి వ్యర్థాలను కాలువలోకి వదులుతున్న దృశ్యాలను రికార్డు చేశారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, నడిపూడి పంచాయతీ అధికారులు స్పందించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ క్రాంతికుమార్ రంగంలోకి దిగి కుమ్మరి కాలువలోకి సెప్టీ క్లీన్ ట్యాంకర్ వ్యర్థాలను వదిలిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రజలు ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న సెప్టిక్ క్లీన్ ట్యాంకర్ల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యర్రమిల్లి నాగసుధాకొండ డిమాండ్ చేశారు.

విద్యుత్ పొదుపు వారోత్సవాల ముగింపు సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ ఈఈ టీవీఎస్ఎన్ మూర్తి

కాట్రేనికోన: చెయ్యేరు పరిధిలోని శ్రీనివాస ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో శనివారం కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ పరమేశ్వరరావు అధ్యక్షతన జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాల ముగింపు సమావేశం జరిగింది. సమావేశానికి రాజమండ్రికి చెందిన ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యుత్ శక్తి ఉత్పాదన, ఆదా చేసే విధానాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆయన వివరించారు. విద్యుత్ ఆదా చేయడం ద్వారా పరిశ్రమలకు కలిగే ప్రయోజనాలను ఈఈ ఎం.రవికుమార్ అవగాహన కల్పించారు. జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో డీఈఈ వీరభద్రరావు, ఏఈలు నాగేశ్వరరావు, టి.శ్రీహరి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు, నిందితుడితో ఎస్ఈబీ పోలీసులు

తాళ్లరేవు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు శనివారం నిర్వహించిన వేర్వేరు దాడుల్లో 75 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. తాళ్లరేవు ఎస్ఈబీ సీఐ జేవీ భవానీ తెలిపిన వివరాల మేరకు గుంటూరు జిల్లా తుమ్మలపాలెం గ్రామానికి చెందిన కంచర్ల నాగరాజు కారులో మద్యం సీసాలను తరలిస్తుండగా తాళ్లరేవు బైపాస్ రహదారిలో దాడి చేసి పట్టుకున్నారు. నాగరాజును అరెస్ట్ చేసి కారు, 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. గాడిమొగ పంచాయతీ చినవలసల గ్రామానికి చెందిన వాతాడి మంగ విక్రయించేందుకు తీసుకెళుతున్న 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్ట్ చేశారు. దాడిలో ఎస్ఈబీ ఎస్ఐ ఎంవీవీబీ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పరిధి పెంపుపై ఎమ్మెల్సీ హర్షం



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: సామాజిక పింఛన్లను రూ.2750 నుంచి రూ.3 వేలకు పెంచేందుకు, ఆరోగ్యశ్రీ పథకం పరిధిని గరిష్ఠంగా రూ.25 లక్షలకు పెంచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడంపై ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శనివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పాడంటే చేస్తాడంతే అని ప్రజలు విశ్వసించేలా నిర్ణయాలు తీసుకుంటారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోని తూచా తప్పకుండా అమలుచేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అందరికీ నాణ్యమైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకంలో రూ.25 లక్షల వరకూ పరిధిని పెంచడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు.

రమేష్‌కు మంత్రి విశ్వరూప్ అభినందన



రమేష్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన అమలాపురానికి చెందిన నూలు రమేష్‌ను రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ శనివారం తన నివాసం వద్ద శాలువా కప్పి సత్కరించి అభినందించారు. రమేష్ వ్యాపారుల సంక్షేమం కోసం మరింత కష్టపడి అండగా నిలవాలని ఆకాంక్షించారు. తనను వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన ముఖ్యమంత్రి జగన్, మంత్రి విశ్వరూప్‌లకు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. రమేష్‌కు అభినందనలు తెలిపినవారిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు వంకాయల కాశీ, పట్టణ వైశ్య సంఘం నాయకుడు యెండూరి నాగేశ్వరరావు తదితరులున్నారు.

బీజేపీ యువ మోర్చా జిల్లా కార్యదర్శిగా సత్తిరాజు



పాటి సత్తిరాజు

అల్లవరం: బీజేపీ యువ మోర్చా జిల్లా కార్యదర్శిగా తూర్పులంక గ్రామానికి చెందిన పాటి సత్తిరాజుని నియమిస్తూ జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్‌గౌడ్ శనివారం నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా సత్తిరాజుకి బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సాయి, ఎన్‌బీవైఎస్ అధ్యక్షులు ఉదయ్‌కుమార్, బాబు, సుబ్బు, కిరణ్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థినులకు ఆర్థిక వితరణ

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి సీఎస్ఎం కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న పేద విద్యార్థినులకు అమలాపురం చిక్కం సరస్వతి, భాస్కరరావు చారిటబుల్ ట్రస్ట్ తరుపున రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. కళాశాలలో ఐదుగురు విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున చెక్కులను ట్రస్ట్ సభ్యులు సీపీ నాగేశ్వరరావు చేతుల మీదుగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.